www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
ఆదివారం | 04 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08

# ప్రజల దరికి ప్రగతి ఫలాలు

**పేదల ఇంటికే సంక్షేమ పథకాలు**

**చెక్‌డ్యామ్ నిర్మాణం రైతులకు ఉపయుక్తం**

**కట్టుకాచారంలో 35 నెలల్లో రూ.13.50 కోట్లతో అభివృద్ధి సంక్షేమ పథకాలు**

**రూ. 6.65 కోట్లతో చెక్‌డ్యామ్**

**రూ.2.50 కోట్లతో కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు బీటీ రోడ్డు నిర్మాణం**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





**ఖమ్మం/అక్షిత బ్యూరో:** ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు. కట్టుకాచారం గ్రామంలో పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.6.65 కోట్లతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను ప్రారంభించడం ఎంతో సంతృప్తినిచ్చిందని అన్నారు. ఈ చెక్‌డ్యామ్‌తో కట్టుకాచారం కొత్తగూడెం పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. రాయగూడెం నుంచి తక్కెళ్లపాడు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు కట్టుకాచారం గ్రామ అంతర్గత రోడ్లకు రూ.52 లక్షలు విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.7.50 లక్షలు ..మిగతా 2లో



# వృత్తి గౌరవాన్ని నిలబెట్టాలి



**సాంకేతికతను పుణికి పుచ్చుకోవాలి**

**మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి**

**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** ప్రజల పక్షాన పని చేసే జర్నలిజం వ్యవస్థ అవసరమని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టులు వృత్తి గౌరవాన్ని నిలబెట్టేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్యమాలపై నిర్వహించిన ఒకరోజు వర్క్ షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని ..మిగతా 2లో

# స్మశానం చెంతనే మురుగు స్మశానం

**ఓపెన్ డ్రైనేజీతో ఊపిరాడని మక్త మహబూబ్‌పేట్**

**మొద్దు నిద్ర వీడి సమస్యకు చెక్ పెట్టండి**



**మియాపూర్, అక్షిత ప్రతినిధి :** మక్త మహబూబ్ పేట్ 241 డివిజన్ స్మశాన వాటికలో ఓపెన్ డ్రైనేజీతో మురుగు నీరు బహిరంగంగా ప్రవహిస్తూ దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణం. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు గుండె గణేష్ ..మిగతా 2లో

# అక్షిత ఎఫెక్ట్

**రేషన్ బియ్యం అక్రమ రవాణ ముఠా గుట్టు రట్టు**

**ప్రధాన నిందితుడు మోటం శ్రీనివాస్ ను అరెస్టు చేసిన పోలీసులు**

**వివరాలను మీడియాకు వెల్లడించిన భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు**




రేషన్ బియ్యం పక్కదారి!

భూపాలపల్లి కేంద్రంగా యథేచ్ఛగా దందా?

కిలోకు రూ.15-16 చొప్పున కొనుగోళ్లు.. రాత్రికిరాత్రే జిల్లా దాటింపు

ప్రజల నుంచి మధ్యవర్తులు.. వారి నుంచి అక్రమ వ్యాపారులు?

విజిలెన్స్, పోలీసుల దాడులు చేస్తున్నా ఆగని అక్రమ రవాణా

**అక్షిత ప్రతినిధి, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లాలో పిడిఎస్ బియ్యం పక్కదారి పడుతున్నాయంటూ సెప్టెంబర్ 14న అక్షిత జాతీయ దిన పత్రికలో ప్రత్యేక వార్త కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. ఈ కథనంతో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు ..మిగతా 2లో

## స్మశానం చెంతనే మురుగు స్మశానం



**మొదటి పేజీ తరువాయి...**

ముదిరాజ్ తీవ్రంగా విమర్శించారు.తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, శాశ్వత పైపులైన్ ఏర్పాటు చేయాలి. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే ప్రజల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండె గణేష్ ముదిరాజ్ రంగారెడ్డి జిల్లా బిజెపి కౌన్సిల్ సభ్యులు తో పాటు శ్రీనివాస్ సారా రాము , గంగారం మల్లేష్ , గుండె గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అక్షిత ఎఫెక్ట్




**మొదటి పేజీ తరువాయి...**

ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగానే రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడు మోటం శ్రీనివాసును పోలీసులు అరెస్టు చేశారు.ఈ వివరాలను భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు మీడియాకు వెల్లడించారు..

**15 మంది ఏజెంట్లతో అక్రమ రవాణా**

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పి.డి.ఎస్ (రేషన్) బియ్యాన్ని అక్రమంగా సేకరించి, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణా సిండికేట్ గుట్టను పోలీసులు రట్టు చేశారు. కేసు విచారణలో భాగంగా ప్రధాన నిందితుడు మోటం శ్రీనివాస్ అందించిన వివరాలను పోలీసులు మీడియాకు వెల్లడించారు.

మహారాష్ట్రలోని సిరోంచకు చెందిన వీర సేటు, శ్రీనివాస్ ఇద్దరు భాగస్వాములుగా ఏర్పడి పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారు.ఈ ఏడాది మే, జూన్, జులై నెలల్లో వీర సేటుతో కలిసి ఒక పథకం రూపొందించి భూపాలపల్లి , దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 10–15 మందిని ఏజెంట్లుగా నియమించుకుని,ఈ ఏజెంట్ల ద్వారా పేదల వద్ద నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేయించి, వాటిని సిరోంచలోని వీర సేటు రైస్ మిల్లుకు తరలించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఏజెంట్లు జూన్, జూలై, ఆగస్టు నెలల్లో సుమారు 3,400 క్వింటాళ్ల పి.డి.ఎస్ బియ్యాన్ని కిలో రూ. 12/- చొప్పున పేదల వద్ద నుంచి కొనుగోలు చేశారు.ఆ బియ్యాన్ని సిరోంచలోని వీర సేటు రైస్ మిల్లుకు తరలించి, కిలో రూ.25/- నుండి రూ. 28/-ల చొప్పున విక్రయించారు. వీర సేటు సదరు సొమ్మును ఏజెంట్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవాడు. ఏజెంట్లు తమకు వచ్చిన డబ్బుల నుంచి 10% కమిషన్ను మోటం శ్రీనివాస్ కు చెల్లించేవారు. అలాగే వీర సేటు నుండి తన వాటాగా వచ్చిన నగదును శ్రీనివాస్ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు పోలీసులు తెలిపారు.పిడిఎస్ అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడిగా ఉన్న శ్రీనివాసును రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.అక్రమ దందాలో పాలుపంచుకున్న మిగతా 14 మంది కోసం ప్రత్యేక బృందాలు వెతుకుతున్నాయన్నారు.. ఈ ప్రెస్ మీట్ లో భూపాలపల్లి సిఐ శ్రీనివాస్,ఎస్ఐ పవన్ పాల్గొన్నారు.

# వృత్తి గౌరవాన్ని నిలబెట్టాలి



**మొదటి పేజీ తరువాయి...**

మెరుగైన జర్నలిజాన్ని ప్రజలకు అందించేందుకు, అలాగే వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా జర్నలిస్టులకు ఉపయోగపడుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నల్గొండ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులకు ఉద్దేశించి ఒక రోజు వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే అక్టోబర్ 12న నాగార్జునసాగర్ లో కూడా నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల జర్నలిస్టులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సామాజిక మాధ్యమాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుతం జర్నలిజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, దీన్ని సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్రిక స్వేచ్ఛ, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, విస్తృతార్థాలు, వర్కింగ్ జర్నలిస్ట్, వృత్తి పరమైన జర్నలిస్టులు తెలుసుకోవాల్సిన ప్రధాన చట్టాలు ,తదిత అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిజల్ ఇంటెలిజెన్స్ వచ్చిన తర్వాత ప్రతి పౌరుడు జర్నలిస్టులా వ్యవహరిస్తున్నారని, ఇలాంటి పరిస్థితులలో వార్తల్లో ఏది నిజం, ఏది అబద్దమో ప్రజలకు తెలిసేలా వార్తలందించాలని, ఏ ఐ,సోషల్ మీడియా వాడకాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా ఇది జర్నలిస్టులకు ఎంతో అవసరమని అన్నారు.

స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో మంచి తోపాటు, చెడు కూడా సంభవించే అవకాశం ఉందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సద్వినియోగం అయ్యేలా జర్నలిస్టులు కృషి చేయాలని, రిపోర్టర్లు నిరాధార వార్తలు రాయవద్దని కోరారు.

ఈ సందర్భంగా ఆర్టిఫిజల్ ఇంటెలిజెన్స్ పై టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ ఇన్వెస్టిగేషన్ ఉడుముల సుధాకర్ రెడ్డి, సోషల్ మీడియాపై నరసింహస్వామిలు జర్నలిస్టులకు శిక్షణ ఇచ్చారు.

నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, నల్గొండ జిల్లా సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ ఓఎస్ డి రహమాన్, పిఆర్ఓ శైలేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# ప్రజల దరికి ప్రగతి ఫలాలు

**మొదటి పేజీ తరువాయి...**

తాగునీటి వసతుల కోసం రూ.3.50 లక్షలు అంగన్వాడీ భవనం నిర్మాణం ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కట్టుకాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో సుమారు రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎల్నినో పరిస్థితులు నెలకొన్నాయని దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని మంత్రి అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కట్టుకాచారం వద్ద చెక్డ్యామ్ నిర్మాణం పూర్తవడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. చెక్ డ్యామ్ వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడు తుందని అన్నారు. చెక్డ్యామ్ నిర్మాణంతో రైతులు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా తాగునీటి సమస్య కూడా ఏర్పడుతోందని ఎల్నినో ప్రభావంతో అనేక గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి కూడా సవాలుగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు.తెలంగాణను ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పోటీ పడేలా ముందుకు తీసుకెళ్లేందుకు విద్యుత్ ఎంతో అవసరమని మంత్రి అన్నారు. సౌర తదితర ప్రత్యామ్నాయ వనరుల నుంచి విద్యుత్ను సమకూర్చుకునేందుకు రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నబియ్యం కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇండ్లు తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి



తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను వారి ఇంటి వద్దకే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం మతం రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు మద్దతు ఇచ్చే అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. రెండవ విడతలో సుమారు 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని హైదరాబాద్లో మరో లక్ష ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు.

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇటీవల సమీప గ్రామంలో పర్యటించిన సమయంలో చెక్డ్యామ్ వల్ల రైతులు ఎంతో సంతోషంగా ఉన్నట్లు గమనించామని తెలిపారు. కట్టుకాచారం వద్ద నిర్మించిన చెక్డ్యామ్ ద్వారా సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా మంత్రి నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వాసంతి ఎస్ఈ ఎం వెంకటేశ్వర్లు పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్ ఖమ్మం ఆర్డీవో ఎన్ శ్రీనివాస్ స్థానిక సర్పంచ్ సైదులు కాంగ్రెస్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు సర్పంచుల సంఘం నేలకొండపల్లి మండల అధ్యక్షుడు రాయపూడి రామారావు సర్పంచులు అశోక రాణి బోయిన వేణు ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు రైతులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత ఆకట్టుకుంటున్న 'ఎకాం' ప్రదర్శన



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** మహిళా పారిశ్రామికవేత్తలు తమ స్వయంశక్తితో ఆర్థికంగా ఎదుగుతూ, పది మందికి ఉపాధి కల్పించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తులకు ప్రజలు అండగా నిలవాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో 'ఎకాం' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అతిథులకు ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ప్రదర్శన ప్రారంభం అనంతరం అతిథులు వివిధ స్టాళ్లను పరిశీలించారు. మున్మున్ సేన్, రోజా, విశాల్ మరియు మిత్రబృందంతో పాటు పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు తమ నైపుణ్యంతో రూపొందించిన వస్తువులను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. మార్కెట్‌లో సాధారణంగా లభించని అనేక ప్రత్యేకమైన హ్యాండ్‌మేడ్ క్రాఫ్ట్స్, అందమైన చీరలు, గాజులు, మెహందీ ఉత్పత్తులు మరియు మహిళలకు అవసరమైన వస్తువులు ఇక్కడ కొలువుదీరాయి. పెద్ద షాపుల్లో అధిక ధరలకు లభించే కొన్ని హ్యాండ్‌మేడ్ ఉత్పత్తులు నేరుగా తయారీదారుల నుంచే అందుబాటులోకి రావడం ఈ ప్రదర్శన ప్రత్యేకత. రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మహిళలకు, గృహాలకు అవసరమైన అనేక రకాల ఉత్పత్తులు ఈ ఎగ్జిబిషన్‌లో కొలువుదీరాయని నిర్వాహకులు తెలిపారు. చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ తమ కాళ్లపై తాము నిలబడుతున్న మహిళలకు 'ఎకాం' చక్కటి వేదికగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎగ్జిబిషన్‌ను సందర్శించడమే కాకుండా, సోషల్ మీడియా ద్వారా ఈ ఉత్పత్తులను మరింత మందికి పరిచయం చేయాలని పిలుపునిచ్చారు. రెండు రోజుల (శనివారం, ఆదివారం) ప్రదర్శనకు ప్రజల నుంచి లభించే ప్రోత్సాహాన్ని బట్టి భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్య శేఖర్, బీఆర్ఎస్ నాయకులు గంగాధర చందు, నారదాసు వసంత రావు, మిడిదొడ్డి నవీన్, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఎండీ అఫ్రోజ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధి..

**ప్రజల అభ్యున్నతి, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ధ్యేయం**

**రూ.2.60 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.

శనివారం 31వ డివిజన్ పరిధిలోని అవంతి స్కూల్ కాలనీ, హంటర్ రోడ్ విశాల్ మార్ట్ ఆవరణ, సూర్యోదయ కాలనీ, శ్రీరామ్ హిల్స్, హంటర్ హిల్స్ రోడ్ నంబర్ 3 ప్రాంతాల్లో సుమారు రూ. 2.60 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పనులను కూడా వేగంగా చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# పిల్లల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

**సర్పంచ్ సూర్యనారాయణమ్మ**

**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామంలో 4వ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా కిచిడీ మిక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ బీరం కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ సూర్యనారాయణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణమ్మ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు బలమైన పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కిచిడీ మిక్స్ ను అందిస్తోందని, దీనిని కూరగాయలతో కలిపి వండి పిల్లలకు అందిస్తే వారి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.





తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీకి పంపి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ సుబ్రహ్మణ్యం, సోషల్ వర్కర్ తిరుపతయ్య గౌడ్, వార్డు మెంబర్ వంగూరు స్వామి, ఆయా దీనమ్మ, ఆశావర్కర్ సంపంగి లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సర్‌ను నిలిపివేసి..తొలగించిన ఓటర్ల హక్కును పునరుద్ధించాలి

**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి పాషా**




**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను కేంద్ర ఎన్నికల సంఘం వెంటనే పదవి నుండి తొలగించాలని, సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. ఈ ప్రక్రియలో అన్యాయంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిన ప్రతి ఒక్కరి ఓటు హక్కును పునరుద్ధించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడు రాజ్యాంగా హక్కు అని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ చౌటుప్పల మున్సిపల్ కార్యదర్శి గోషిక కరుణాకర్, ఉష్కాగుల శ్రీనివాస్, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, బొడ్డు అంజిరెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, తూర్పునూరి మల్లేష్, ఆర్టీవో పాషా, బొడ్డు రాజు, భావనలపల్లి స్వామి, ఎండి ఖయ్యూం, బొమ్మ కంటి కృష్ణ లు పాల్గొన్నారు.

# చెక్ పవర్‌పై సర్కార్ నిర్ణయం భేష్

**సర్పంచ్-ఉపసర్పంచ్‌ల సమన్వయంతోనే గ్రామాభివృద్ధి**

**గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి**




**గుడిపల్లి, అక్షిత ప్రతినిధి:** చెక్ పవర్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి స్వాగతించారు. నిర్ణీత కాలపరిమితిలో సమస్యకు పరిష్కారం చూపేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూల చర్యగా అభివర్ణించారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌ల మధ్య సమస్యలను వ్యక్తిగత విభేదాలుగా చూడకుండా గ్రామ పరిపాలనకు సంబంధించిన అంశంగా భావించాలన్నారు. గ్రామాభివృద్ధి సజావుగా సాగాలంటే ఇరువురూ పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. అధికారాలు, బాధ్యతల విషయంలో భేదాభిప్రాయాలు ఉంటే చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని కోరారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సర్పంచ్--ఉపసర్పంచ్‌ల మధ్య సమన్వయంతోనే గ్రామ పాలన బలోపేతమవుతుందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టు రాజ్ కుమార్‌కు అంతర్జాతీయ శాంతి పురస్కారం




**భీమదేవరపల్లి, అక్షిత ప్రతినిది:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల జర్నలిస్ట్ మాడుగుల రాజ్ కుమార్ కు అంతర్జాతీయ శాంతి పురస్కారం లభించింది. శాంతి, మానవత సేవలు, సామాజిక ప్రభావం, సుస్థిర అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ సార్వసత్వ పరిషత్ లో వంశీ ఈవెంట్స్ అండ్ మోర్డు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్రం చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. సమాజంలో సానుకూల మార్పు కోసం చేసిన కృషిని, ప్రజల్లో స్ఫూర్తిని నింపే సేవలకు గాను ఎంపిక చేసినట్లు ప్రశంస పత్రంలో పేర్కొన్నారు. నిర్వాహణ కార్యక్రమంలో మోర్డు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అండేకర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, అతిథులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యమే ధ్యేయం

### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్





**కోదాడ అక్షిత ప్రతినిధి:** కోదాడ నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, మెరుగైన ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం కోదాడలోని ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా నిర్మించిన ఇన్‌పేషెంట్ విభాగాన్ని స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.

#### రూ. 26 కోట్లతో 100 పడకల స్థాయికి పెంపు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా 30 పడకలుగా ఉన్న కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. దీనికోసం ప్రభుత్వం రూ. 26 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఆసుపత్రి పునరుద్ధరణ పనులతో పాటు నూతనంగా నిర్మించిన ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఇన్‌పేషెంట్ విభాగాలు పూర్తికావడంతో వెంటనే ప్రజల వినియోగార్థం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

#### అన్ని రకాల సేవలు పునఃప్రారంభం

శనివారం నుంచే ఆసుపత్రిలో అన్ని రకాల ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినందున కోదాడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, రోగులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సహాయం అందించి బాధ్యతాయుతంగా సేవలు అందించాలని వైద్యాధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ, మాజీ ఎడమ కాలువ చైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ, డాక్టర్ సుబ్బారావు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇతర వైద్యులు, ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాంస్కృతిక ప్రదర్శన సీజన్-2 గోడపత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** నగరంలో నిర్వహించనున్న 'సాంస్కృతిక ప్రదర్శన (కల్చరల్ ఎక్స్‌పో) సీజన్-2' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను (వాల్‌పోస్టర్) కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. గుల్షన్ ప్రదర్శన నిర్వాహకులు శనివారం ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ వేడుకకు విచ్చేయాల్సిందిగా వారు సాదరంగా ఆహ్వానించగా ఎమ్మెల్యే గోడపత్రికను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ నగరంలోని మహాత్మా జ్యోతిభా పూలే మైదానంలో (సర్కస్ గ్రౌండ్) అక్టోబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ ప్రదర్శనను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారుల కోసం ప్రత్యేక వినోదాత్మక కార్యక్రమాలు, రకరకాల వస్తువుల విక్రయశాలలు (షాపింగ్ స్టాళ్లు), రుచికరమైన తినుబండారాల కేంద్రాలు (ఫుడ్ కోర్టులు) ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయన్నారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి వచ్చి సంతోషంగా గడిపేందుకు వీలుగా నిర్వాహకులు చక్కటి ఏర్పాట్లు చేస్తున్నారని, ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు వినోదంతో పాటు నూతన అనుభవాలను అందిస్తాయని పేర్కొన్నారు.కరీంనగర్ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో కుటుంబ సమేతంగా విచ్చేసి ఈ రెండు రోజుల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరి శంకర్, మాజీ మేయర్ సర్ధార్ రవీందర్ సింగ్, కార్పొరేటర్లు యూసుఫ్, అలీ, జమ్మూ, మైనార్టీ నగర శాఖ అధ్యక్షులు మీర్ షౌకత్ అలీ, షర్ఫుద్దీన్, నాయకులు నవాజ్ హుస్సేన్, గుల్షన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల గణేష్

### విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తా: గణేష్



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రానికి చెందిన పెండ్యాల గణేష్‌ను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గతంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, బీజేవైఎం వరంగల్ జిల్లా అధికార ప్రతినిధిగా గణేష్ పనిచేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జనగామ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు హరీష్, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి లేగ మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి, రాయపర్తి మండల అధ్యక్షుడు నూనె అనిల్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రావణ్‌తో పాటు జిల్లా, మండల నాయకులకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ అన్నారు. 9వ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం భూపాలపల్లి సీడీపీఓ కార్యాలయంలో మండల స్థాయి కార్యక్రమం నిర్వహించారు..

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడారు..తల్లులు, చిన్నారుల్లో రక్తహీనత నివారణకు అవగాహన కల్పించాలని సూచించారు. 0--5 ఏళ్ల పిల్లల బరువు, ఎత్తును క్రమం తప్పకుండా పరిశీలించి పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి బాలామృతం ప్లస్ అందించడం అభినందనీయమన్నారు..

అనంతరం జిల్లా సంక్షేమాధికారి జి. మల్లేశ్వరి మాట్లాడుతూ గర్భస్థ శిశువు దశ నుంచి బిడ్డకు రెండేళ్ల వయస్సు వరకు తొలి వెయ్యి రోజులు ఎంతో కీలకమన్నారు. పిల్లలకు వైవిధ్యమైన ఆహారం, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు అందించడంతో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డా. రోహిణి తల్లులకు ఆరోగ్యకరమైన ఆహారం, రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో ఆరు నెలల చిన్నారులకు అన్నప్రాసనలు, మూడేళ్ల పిల్లలకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.ఈ సూపర్‌వైజర్లు వి. అరుణ, కె. రజిత, పి. లక్ష్మీ, రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## లింగాల కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

### ఉద్యమకారులను గుర్తించి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రరెడ్డి,ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం అందజేశారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ,కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేసి, కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆనాటి ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ అండగా నిలిచిన లింగాల కేదారి సేవలను తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం గుర్తించి, ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ సమయంలో పోరాడిన ఉద్యమకారులను ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమంలో పాల్గొని పోరాటం చేసిన ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# కరీంనగర్ నేత బజార్‌లో చిరు వ్యాపారుల బేజార్

**హోల్‌సేల్ వ్యాపారుల హవా**

**వేలల్లో కొనుగోళ్లు తెల్ల కాగితం పైనే బిల్లులు**

**జీఎస్టీ వివరాలు, ఇన్వాయిస్ నంబర్లు లేకుండానే లావాదేవీలు**

**చోద్యం చూస్తున్న అధికారులు**



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో వారపు సంతగా ప్రత్యేక గుర్తింపు పొందిన నేత బజార్‌లో వ్యాపార లావాదేవీల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రతి శనివారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు కొనసాగే ఈ సంతకు కరీంనగర్‌తో పాటు చొప్పదండి, గంగాధర, సుల్తానాబాద్, సిరిసిల్ల, కొత్తపల్లి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు,హోల్ సెల్ , రిటైల్ కొనుగోలుదారులు వస్తుంటారు.

పిల్లలు, మహిళలు, పురుషులకు అవసరమైన దుస్తులు, రెడీమేడ్ వస్త్రాలు, ఇతర వస్త్ర సామగ్రి ఇక్కడ విస్తృతంగా విక్రయిస్తుంటారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో హోల్‌సేల్ వ్యాపారుల వద్దకు రిటైల్ వ్యాపారులు పెద్ద మొత్తంలో చేరి సరుకులు కొనుగోలు చేసి అదే ప్రాంతంలో విక్రయాలు సాగిస్తుంటారు.

**" అసలు సమస్య ఇక్కడే"**

వేలాది రూపాయల విలువైన వస్తువులు కొనుగోలు చేసినప్పటికీ కొంతమంది వ్యాపారులు “"సాధారణ తెల్ల కాగితంపై మాత్రమే బిల్లు ఇస్తున్నారనే ఆరోపణలు"” వినిపిస్తున్నాయి. ఆ బిల్లులపై దుకాణం పూర్తి చిరునామా, వరుస ఇన్వాయిస్ నంబర్, జీఎస్టీ వివరాలు, వస్తువుల పూర్తి వివరాలు వంటి అంశాలు లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని రిటైల్ వ్యాపారులు చెబుతున్నారు.

కొన్ని సందర్భాల్లో చిన్న మొత్తాల కొనుగోళ్లకూ సరైన బిల్లు ఇవ్వడం లేదని, పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేసినప్పుడు కూడా సాధారణ కాగితంపై మొత్తాన్ని రాసి చేతిలో పెడుతున్నారని పలువురు వ్యాపారులు వాపోతున్నారు.

**"బిల్లింగ్ విధానంపై పలు రకాల అనుమానాలు"**

జి ఎస్ టి నిబంధనల ప్రకారం నమోదైన సరఫరాదారు జారీ చేసే పన్ను ఇన్వాయిస్‌లో సరఫరాదారు పేరు, చిరునామా, జి ఎస్ టి ఇన్ ప్రత్యేక ఇన్వాయిస్ నంబర్, తేదీ, వస్తువుల వివరణ, పరిమాణం, విలువ, పన్ను తదితర వివరాలు ఉండాలి. అయితే నేత బజార్‌లో కొంతమంది వ్యాపారులు అందిస్తున్నట్లు చెబుతున్న తెల్లకాగితపు రశీదుల్లో ఈ వివరాలు ఎంతవరకు ఉంటున్నాయన్నది అధికారుల తనిఖీలతో తేలాల్సి ఉంది.

**రెడీమేడ్ దుస్తుల వ్యాపారంలోనూ ఇదే తంతు**

నేత బజార్‌లో రెడీమేడ్ దుస్తుల హోల్‌సేల్ వ్యాపారం పెద్దఎత్తున సాగుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కొనుగోళ్లు మరింత పెరుగుతాయి. వివిధ ప్రాంతాల నుంచి రిటైల్ వ్యాపారులు వచ్చి పెద్ద మొత్తంలో దుస్తులు కొనుగోలు చేస్తుంటారు.

అయితే కొనుగోలు చేసిన సరుకుకు సంబంధించి పూర్తి వివరాలతో బిల్లులు అందుతున్నాయా' బిల్లుల్లో చూపిన మొత్తమే వాస్తవ లావాదేవీనా' అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**"తయారీదారు నుంచి మార్కెట్ వరకు లెక్కలపై ఆరా"**

వస్త్ర తయారీకి సంబంధించి ముడి వస్త్రం ఎక్కడి నుంచి వస్తోంది' స్టిచింగ్ ఎక్కడ జరుగుతోంది' తయారీ ఎవరి వద్ద జరుగుతోంది' సరుకు ఎంత పరిమాణంలో తయారవుతోంది' తయారీదారులకు ఎంత చెల్లిస్తున్నారు' మార్కెట్‌కు ఎంత సరుకు వస్తోంది' అన్న అంశాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యాపారులు అంటున్నారు.

చిన్న వ్యాపారంలా కనిపించే ఈ వ్యవహారంలో సరుకు కొనుగోలు, తయారీ, రవాణా, విక్రయాలు తదితర దశల్లో సరైన లెక్కలు నిర్వహిస్తున్నారా లేదా అన్నది తనిఖీల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**"జీరో బిల్లింగ్‌పై అనుమానాలు"**

నేత బజార్‌లో కొంతమంది వ్యాపారులు సరైన బిల్లులు ఇవ్వకుండా కేవలం తెల్ల కాగితాలపై లావాదేవీలు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిని స్థానికంగా కొందరు 'జీరో బిల్లింగ్' వ్యవహారంగా పేర్కొంటున్నారు.

అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత' ఎంతమంది వ్యాపారులు నిబంధనలను పాటిస్తున్నారు' ఎంతమంది వద్ద సరైన బిల్లింగ్ వ్యవస్థ ఉంది' అన్నది అధికారిక తనిఖీల ద్వారానే తేలాల్సి ఉంది.

**" రిటైల్ వ్యాపారుల ఆవేదన"**

హోల్‌సేల్ వ్యాపారుల వద్ద పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేసి వాటిని చిన్నచిన్న దుకాణాల్లో విక్రయించే రిటైల్ వ్యాపారులకు సరైన బిల్లు లేకపోతే ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు చెబుతున్నారు. సరుకుల కొనుగోలుకు సంబంధించిన ఆధారం లేకపోవడంతో తర్వాతి దశలో లెక్కలు చూపించడంలో సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.

**" అధికారుల తనిఖీల నామమాత్రమేనా"**

నేత బజార్‌లో ప్రతి వారం భారీ స్థాయిలో వ్యాపారం జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ ఎంతమేరకు ఉందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో తనిఖీలు జరిగినప్పటికీ అవి నామమాత్రంగానే జరిగాయన్న చర్చ స్థానికంగా ఉందని వ్యాపారులు చెబుతున్నారు.అయితే గతంలో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు అందుబాటులో లేకపోవడంతో, ఈ అంశంపై సంబంధిత శాఖల స్పందన తీసుకోవాల్సి ఉంది.

**"పండుగ సీజన్‌లో మరింత జోరుగా"**

పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో నేత బజార్‌కు కొనుగోలుదారుల రద్దీ పెరుగుతుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మాత్రమే కాకుండా ఇతర పట్టణాల నుంచి కూడా రిటైల్ వ్యాపారులు వచ్చి సరుకులు కొనుగోలు చేస్తుంటారు.

ఈ సమయంలో పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నందున బిల్లింగ్ విధానం, స్టాక్ వివరాలు, కొనుగోలు--విక్రయాల రికార్డులు, పన్ను చెల్లింపులు తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

**అధికారుల స్పందన కరువు**

నేత బజార్‌లో జరుగుతున్న వ్యాపార లావాదేవీలపై సమగ్రంగా తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు. నిబంధనలు పాటిస్తున్న వ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తేలితే సంబంధిత వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తెల్ల కాగితాలపై బిల్లుల వ్యవహారంపై సంబంధిత వాణిజ్య పన్నుల శాఖ, ఇతర అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దాతల సహకారంతో కడవేర్గు పాఠశాలకు నీటి సౌకర్యం



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల మండలంలోని కడవేర్గు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంచినీటి కొరత ఉన్నందున, పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని గ్రామ సర్పంచి కి మరియు గ్రామ నాయకులకు తెలపడంతో, వారందరూ సానుకూలంగా స్పందించి వెంటనే సక్సెస్ గా బోరు వేసి పాఠశాల నీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు మరియు పేరెంట్స్ కమిటీ సభ్యులు బోరు వేయడానికి సహకరించిన గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్, ఉప సర్పంచ్ జంగ సురేందర్, దొడ్డ కృష్ణారెడ్డి, డా.పోల్ రెడ్డి లక్ష్మి, పూర్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కాసం ఉమా రాణి, మరియు బిఆర్ఎస్ చేర్యాల మండలాధ్యక్షులు అనంతుల మల్లేశం, పాఠశాల ఉపాధ్యాయులు వంగర వేణు గోపాల్, కారోబార్ కొమ్ముల భిక్షపతి, వార్డు సభ్యులు పోగుల శ్రీనివాస్, గదరాజు రాకేష్, పొన్న రవి, గదరాజు ఇందిర, మాజీ ఎంపీటీసీ కొమ్మినేని నాగభూషణం లకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా జిల్లా కాంగ్రెస్ నాయకుడు జెల్లా వెంకటేశం జన్మదిన వేడుకలు



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** జిల్లా కాంగ్రెస్ నాయకుడు జెల్లా వెంకటేశం జన్మదిన వేడుకలను పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జెల్లా వెంకటేశంను శాలువాలతో సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్, ఉప సర్పంచ్ మోటె రమేష్, మాజీ ఎంపీటీసీ సాల్వేర్ అశోక్, గుత్త నర్సిరెడ్డి, బొడ్డు సాలయ్య, మహమ్మద్ నాసర్, గోదాస్ శ్రీమన్నారాయణ, మహమ్మద్ అక్రమ్, కేశవ్ దాస్ వెంకటేశం, కోట సుధాకర్, సాల్వేర్ లింగం, బొడ్డు శంకరయ్య, కొండ శేఖర్ గౌడ్, కొమ్ము శేఖర్, గొరిగె శేఖర్, గొలుసుల ప్రసాద్, మహమ్మద్ రిజ్వాన్, మిర్జా ఇనాయతుల్లా బేగ్, మహమ్మద్ అజార్, మహమ్మద్ జానీ, లవణం సాయి, సైదాచారి, కక్కిరేణి రవీందర్, తెల్ల ప్రసాద్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జువాజి శ్రీకాంత్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఖైరబోయిన శోభ తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద పీఠం భూమి పూజ



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో రాంప్రసాద్ గురుస్వామి పగడాల కిషోర్ ఆధ్వర్యంలో గత 17 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహిస్తున్న అయ్యప్ప స్వాముల 71 రోజుల అన్నప్రసాద పీఠం ఈ సంవత్సరం 18వ వార్షికోత్సవంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా భూమి పూజ కార్యక్రమం వీడివోస్ కాలనీ వెంకటేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న స్థలం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు అయ్యప్ప దీక్షాపరులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గత 17 సంవత్సరాలుగా అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నప్రసాదం అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ సంవత్సరం 18వ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా 71 రోజుల పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాంప్రసాద్ గురుస్వామి పగడాల కిషోర్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి భక్తులు దాతలు సహకరించాలని కోరారు.ఈ భూమి పూజ కార్యక్రమం లో అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నాగ రామాచారి జిల్లా ప్రధాన కార్యదర్శి బజ్జూరి రమణారెడ్డి టౌన్ అధ్యక్షులు కోయ హరికిషన్ కార్యదర్శి శ్రీనివాస్ ప్రచార కార్యదర్శి గోపాలరెడ్డి అరుణ్ జిల్లా కమిటీ నుండి రాజ్యలక్ష్మి సత్యనారాయణస్వామిశ్రీను స్వామి శేఖర్ స్వామి వేణు తదితర భక్తులు పాల్గొన్నారు.

## మదర్సా దారుల్ ఉలూమ్ మహమ్మదీయ నిర్వహణ కమిటీ ఎన్నిక ఎప్పుడు?

### జాప్యం చేయడానికి కారకుడు పట్టణ బిఆర్ ఎస్ నాయకుడేనా?

### లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే ఆలస్యం చేస్తున్నారని ప్రజల్లో అనుమానాలు!



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పట్టణంలోని స్థానిక ఉర్దూ అరబిక్ మదర్సా దారుల్ ఉలూమ్ మహమ్మదీయ నిర్వహణ కమిటీ కాల పరిమితి ముగిసినెల రోజులుకావస్తున్నప్పటికీ నూతన కమిటీ ఎన్నిక ఇంతవరకూ చేపట్టలేదు. కనీసం ఇంత సమయంలోగా ఏర్పాటు చేస్తామన్న సమాచారం కూడా ఇవ్వడం లేదు. పట్టణానికి చెందిన ఒక మైనారిటీ బిఆర్ఎస్ నాయకుడి కనుసన్నల్లోనే మదర్సా మహమ్మదీయ దారుల్ ఉలూమ్ నిర్వహణ నూతన కమిటీ ఏర్పాటు విషయంలో జాప్యం జరుగుతుందని సత్తుపల్లి పట్టణంలో చర్చించుకుంటున్నారు. నిరుపేద ముస్లిం విద్యార్థులకు ఉచితంగా ధార్మిక విద్య నేర్పించడం కోసం ఏర్పాటు చేయబడిన ఈ మదర్సా దారుల్ ఉలూమ్ మహమ్మదీయ నిర్వహణలో పారదర్శకత, జవాబు దారీతనం లేదనే ఆరోపణలు గతంలో వచ్చినవిషయం తెలిసిందే.అటువంటి ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి సంజాయిషీ ప్రజలకు ఇవ్వకపోగా తన రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ నాయకుడు మదర్సా నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయడంలో కావాలనే జాప్యం చేస్తున్నాడని సత్తుపల్లి పట్టణంలో ముస్లింలు చర్చించుకుంటున్నారు.మదర్సా కు సంబంధించిన లక్షల రూపాయల ఆదాయ, వ్యయాలు, షాపు కిరాయిలు అన్నీ నిర్వహణ కమిటీ తో సంబంధం లేకుండానే జరుగుతున్నాయని , కమిటీ ఏర్పాటు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని అడిగితే సమాధానం దాటవేస్తూ, తమ అనుయాయులకు లబ్ధి చేకూర్చాలని చూస్తున్నారు అని సత్తుపల్లి పట్టణంలో ముస్లిం లు చర్చించుకుంటున్నారు.ఇప్పటికైనా మదర్సా నూతన కమిటీ ఏర్పాటు చేసి ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించి మదర్సాలోఉన్నపేదవిద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరుతున్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ జంబుల వెంకట్ రెడ్డికి సన్మానం



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** ఆకునూరు రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా జంబుల వెంకట్ రెడ్డి ని నియమించిన సందర్భంగా శనివారం మండలంలోని ఆకునూరు గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రణం శ్రీకాంత్ ఆధ్వర్యంలో జంబుల వెంకటరెడ్డిని ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కొమ్మూరి ప్రతాపరెడ్డి సహకారంతో ఆకునూరు గ్రామ అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా వెంకట్ రెడ్డిని నియమించడం మా గ్రామానికి గర్వకారణమని, ఆయన రైతులకు ఏ సమస్య ఉన్నా అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, మండల కార్యదర్శి కొయినేని నర్సయ్య, గ్రామ నాయకులు తరికంటి కొమురయ్య, మంతపురి వెంకన్న, అవ్వల్ శ్రీనివాస్, పోరండ్ల వెంకటేష్, పాల సాయిలు, సుర సంపత్, ఉడుత బాలరాజు, బోయిని మల్లేశం, శంకర్ బాబు, బోయిని హరి, సుంకరి వీరయ్య, పొట్లపల్లి ప్రశాంత్, కడారి నరేష్, మరియు బిక్షపతి, చందు ,సాయి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు

### కొల్లాపూర్‌లో రూ.2.50 కోట్లతో ఎస్టీ బాలుర వసతిగృహ నిర్మాణానికి మంత్రి జూపల్లి శంకుస్థాపన



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్, అక్టోబర్ 3 : గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు, నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలో రూ. 2. 50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఎస్టీ బాలుర వసతిగృహం నూతన భవనానికి



శనివారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులు విద్యలో ముందుకు సాగేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విద్యార్థుల చదువుకు అనుకూలమైన వాతావరణం, సురక్షితమైన వసతి, నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటే వారు మరింత మెరుగ్గా విద్యనభ్యసించగలరని అన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని.. గిరిజన విద్యార్థులకు విద్యా అవకాశాలను మెరుగుపరిచి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. హాస్టళ్లలో భవనాలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని.. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. కొల్లాపూర్‌లో నిర్మించనున్న నూతన ఎస్టీ బాలుర వసతిగృహం అందుబాటులోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కలగనున్నాయని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకే తొలిముద్ద

### కొల్లాపూర్‌లో పథకాన్ని ప్రారంభించి చిన్నారులకు స్వయంగా అల్పాహారం తినిపించిన మంత్రి జూపల్లి



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్, అక్టోబర్ 3: చిన్నారుల ఎదుగుదలకు తొలిదశ నుంచే పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్పాహార పథకం 'తొలిముద్ద' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అల్పాహార తొలిముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు అల్పాహారాన్ని మంత్రి జూపల్లి స్వయంగా తినిపించారు. మంత్రి జూపల్లి



మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని అన్నారు. చిన్నారులకు ఉదయం అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. అక్టోబరు 1 నుంచి నాగర్‌కర్నూల్‌తో పాటు రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో తొలిదశలో 'తొలిముద్ద' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు.

పౌష్టికాహారంతో పాటు ప్రీ-స్కూల్ విద్య అందించడం ద్వారా చిన్నారుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తొలిముద్ద కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్క ఓటరూ ఓటు హక్కు కోల్పోకూడదు

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

### రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి




**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** అర్హులైన ఏ ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు హక్కు పునాది వంటిదన్నారు. ఓటు హక్కు దుర్వినియోగాన్ని అరికట్టడం ఎంత ముఖ్యమో.. అర్హులైన ఒక్క ఓటరూ ఓటు హక్కును కోల్పోకుండా చూడటం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.

జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్న కలెక్టర్, అధికారులు, సహకరిస్తున్న రాజకీయ పార్టీల ప్రతినిధులను అభినందించారు. మిగిలి ఉన్న ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. బీఎల్ఓలు తప్పనిసరిగా ఓటర్ల ఇళ్లకు స్వయంగా వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.



ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లకు సంబంధించిన కారణాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతపై స్వీప్ కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అధికారులంతా మరింత బాధ్యతతో పనిచేసి జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోందని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మిగిలి ఉన్న డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను పరిశీలకులకు సమగ్రంగా వివరించారు. బీఎల్ఓలు ఓటర్ల ఇళ్లకు వెళ్లి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ చేపడుతున్నారని తెలిపారు. ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. మిగిలి ఉన్న ఫారాల పరిష్కారం, ఫిర్యాదుల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామని వివరించారు. నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందన్నారు. మరణించిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓట్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి జాబితా నుంచి తొలగించినట్లు కలెక్టర్ తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహకారం లభిస్తోందని తెలిపారు.

సమీక్ష అనంతరం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు టి.కె. శ్రీదేవి, కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి నిర్మల్ పట్టణంలోని కస్బా, నిర్మల్ గ్రామీణ మండలంలోని న్యూ పోచంపాడ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై స్థానిక బీఎల్ఓలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాల పరిశీలన, ఫారాల పరిష్కారం తదితర అంశాలను పరిశీలించారు. ప్రక్రియ కొనసాగుతున్న తీరుపై పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా, ఉట్నూర్ సబ్ కలెక్టర్లు అజ్మీరా సంకేత్ కుమార్, ప్రణయ్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

### నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరపాలక సంస్థను తెలంగాణ రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా శనివారం మేయర్ 3, 11, 29వ డివిజన్లలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.

మొదటగా 11వ డివిజన్ కట్టరాంపూర్‌లో స్థానిక కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సయ్యతో కలిసి సుడా నిధులు రూ.3 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం 3వ డివిజన్ మాణిక్యేశ్వరీ నగర్ రోడ్ నంబర్-2లో స్థానిక కార్పొరేటర్ సాదినేని లావణ్య మునీందర్ తో కలిసి నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.24.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

తదుపరి 29వ డివిజన్ కిసాన్ నగర్, మంగని వాడ ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తో కలిసి యూఐడీఎఫ్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.అనంతరం 28, 29వ డివిజన్ల పరిధిలోని హనుమాన్ దేవాలయం సమీపంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.56 లక్షలతో ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా కోసం చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, ప్రజాప్రతినిధులు--అధికారుల సమన్వయంతో కరీంనగర్‌ను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పలువురు కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అశోక్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార అవగాహన కార్యక్రమం



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ పట్టణం అశోక్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవంలో భాగంగా శనివారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రామ్ సందర్భంగా వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేసి, పోషకాహారంపై అవగాహన కల్పించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ , అంగన్వాడీ టీచర్ జమీన, తల్లులు, ఏఎన్ఎం స్వరూప, ఆశ, ఆయా తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్తాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



**చేర్యాల అక్షిత ప్రతినిధి:** చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి టీ.కృష్ణ రాష్ట్రాస్తాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహ చారి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 19 పోటీలలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా అత్నూర కాలేజీలో జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో కృష్ణ పాల్గొని ప్రతిభ కనబరిచి, నార్సింగ్ లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల లలో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యము వహిస్తాడని తెలిపారు. అనంతరం కృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహ చారి అభినందించగా, పిఈటి రేణుక, పిడి సురేష్ లను ఇతర అధ్యాపకులు అభినందించారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

### సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిని సులోచన రాణి






**నడిగూడెం, అక్షిత న్యూస్:** ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని మంచి ఫలితాలు సాధించాలని సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారిని సులోచన రాణి కోరారు. శనివారం నడిగూడెం కే ఎల్ ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం సరఫరా చేసిన ఉచిత యూనిఫాం లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం రాత పుస్తకాలు యూనిఫార్మ్ షూస్ బెల్ట్ ఐడి కార్డ్ తో పాటు బ్యాగులు పంపిణీ చేస్తుందని త్వరలో బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్న భోజనం అందించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. క్రమం తప్పకుండా కళాశాలకు హాజరవుతూ ఇక్కడ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డి విజయ నాయక్ అధ్యాపకులు డాక్టర్ జాన్ పాషా కృష్ణ మహేష్ ఈశ్వర్ నాగరాజు శ్రీనివాసరావు డాక్టర్ కోళ్ల శ్రీనివాస్ వెంకటేశ్వరరావు తేజశ్రీ రజిత సుజాత తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకూడదు

**భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా చేయాలి.**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో భూ సమస్యలకు సంబంధించి అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, భూముల రీ సర్వే పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారిగా పెండింగ్ లో ఉన్న భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సదాబైనమా, దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. సర్వే బృందం మొత్తం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ స్పీకర్ జాటోత్ చేతుల మీదుగా దివ్యమూర్తికి అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం




**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తికి హైదరాబాదులోని బొగ్గులకుంటలో గల తెలంగాణ సారస్వత పరిషత్తులో అంతర్జాతీయ శాంతి విశిష్ట పురస్కారం (ఇంటర్నేషనల్ పీస్ ఎక్సెలెన్స్ అవార్డు) లభించింది. ఈ అవార్డును డాక్టర్ దివ్యమూర్తి తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్ చేతుల మీదుగా అందుకున్నారు. ఇన్పాక్ట్ ఫౌండేషన్ వారు దివ్యమూర్తి ప్రతిభను చూసి ఈ అవార్డు ను అందించడం జరిగింది. దివ్యమూర్తి లాంటి మేధావులు ప్రతిభావంతులు ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమని డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా దివ్యమూర్తి మాట్లాడుతూ తనకు ఈ సన్మానం జరగడం ఎంతో సంతోషంగా ఉందని ఇప్పటివరకు తనకు 85 అవార్డులు వచ్చాయని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో అందేకర్ శ్రీనివాస్ డాక్టర్ వంశీకృష్ణ దివ్యమూర్తి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** లింగాల మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామానికి చెందిన పానుగంటి స్వామి అకాల మరణం చెందడం వల్ల వెంటనే స్పందించిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆ కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది అలాగే ప్రభుత్వం తరపున అందించే రైతు బీమా తదితర అంశాలలో తోడ్పాటుగా ఉంటామని మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మార్గం పర్వతాలు యాదవ్ అధ్యక్షులు చింతకుంట శ్రీశైలం యాదవ్ ఉపాధ్యక్షులు ఆగమోని శ్రీశైలం యాదవ్ సభ్యులు మొగిలి మహేష్ యాదవ్ జంగం మహేష్ యాదవ్ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు

# మహబూబ్‌నగర్ రూపురేఖలు మారుస్తాం

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన రూ. 2.33 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**డివిజన్ల వారీగా అభివృద్ధి పనుల వివరాలు**

**4వ డివిజన్ (అంబటిపల్లి):** ప్రజల చిరకాల డిమాండ్‌ను పరిష్కరిస్తూ రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న నాణ్యమైన వీడీసీసీ రోడ్డు పనులకు



శంకుస్థాపన చేశారు.

**5వ డివిజన్ (ఎదిర):** కాలనీవాసుల రాకపోకల సౌకర్యార్థం రూ. 80 లక్షలతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. 24వ డివిజన్: వర్షాకాలంలో ముంపు సమస్య తలెత్తకుండా రూ. 71 లక్షలతో నూతన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి, అలాగే ఇప్పటికే రూ. 24 లక్షలతో పూర్తి చేసిన డ్రైన్ ను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

25వ డివిజన్: రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నగరంలో సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి డివిజన్‌ను సమానంగా అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని, అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, స్థానిక కార్పొరేటర్లు అనుప ఆంజనేయులు, లలితా భాను చందర్, పెద్ద గొల్ల నర్సింహులు, రామస్వామి, గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, పాండురంగా రెడ్డి, తాహేర్, ఫక్రు ఖురేషి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సిరిగిరి మురళి, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

**విద్యార్థుల మనస్తత్వాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలి**

**అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం**

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాస్మా రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనని, కాబట్టి వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని , పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో కూడా పంచుకునే అవకాశం ఉన్నందున, పాఠశాలల్లో వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాలు సమాచార వినియోగనికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, వాటి అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా, విజ్ఞతతో వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థులు ఆపదకర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వాటిని ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో గుడ్ టచ్--బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, ట్రాస్మా రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, డి.టి.ఓ. శ్రీనివాస్, ట్రాస్మా జిల్లా అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాచల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సొంత నిధులతో ఉపాధ్యాయులను నియమించిన మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్





**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేక గత రెండు నెలలుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ విద్యార్థుల విద్యకు ఆటంకం కలగకుండా అదే పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు బస్వరాజుని, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయురాలు వసంతను తన సొంత ఖర్చుతో వేతనాలు చెల్లిస్తూ నియమించారు.

10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్స్‌ను శాంత నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందజేశారు.

అలాగే విద్యార్థులు సులభంగా ఇంగ్లీష్ మాట్లాడేలా, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ స్కిల్స్ పెంపొందించుకునేలా ఇంగ్లీష్ ప్రొఫెసర్ రామేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తానని తెలిపారు.

పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన సామాగ్రి, కంప్యూటర్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు మాజీ మంత్రి దృష్టికి తీసుకురాగా, సైన్స్ ల్యాబ్ సామాగ్రితో పాటు కంప్యూటర్లను ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి, వార్డు మెంబర్ రాజ గౌడ్, ఉపాధ్యాయులు రాజవర్ధన్ రెడ్డి, ఆంజనేయులు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.